జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 123 16-5-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


# 2034 వరకు నేనే సీఎం

- ఆ తర్వాతే జాతీయ రాజకీయాల్లోకి..
- పార్టీ చెప్పిన వారికి రాష్ట్రాన్ని అప్పగించి వెళ్తా
- నా అనుభవాన్ని దేశం కోసం ఉపయోగిస్తా..
- ప్రధాని పదవి కోసం రాహుల్‌ను నేను ఒప్పించా..
- 2029 ఎన్నికల్లో రాహుల్ గాంధీయే ప్రధాని అభ్యర్థి
- మోదీ, నేను మైకుల ముందే మాట్లాడుకున్నాం..
- జీవితంలో చాలా సౌకర్యంగా, 100 శాతం సంతృప్తితో ఉన్నా
- నా ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తారు.. ప్రతిపక్షం కాదు
- మైనర్ బాలిక విషయంలో ఎలా అంటే అలా వెళ్లలేం
- బండి సంజయ్ తన కొడుకును తెచ్చి పోలీసులకు అప్పగించాలి



హైదరాబాద్: '2034 వరకు నేనే ముఖ్యమంత్రిని. ఆ తర్వాత ఉండను. తర్వాతి తరానికి అవకాశం ఇస్తా. పార్టీ చెప్పిన వారికి రాష్ట్రాన్ని అప్పగించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తా. నా అనుభవాన్ని దేశం కోసం ఉపయోగిస్తా..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. 2034 వరకు కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు అధికారం ఇస్తారని ఆయన మరోమారు ధీమా వ్యక్తం చేశా రు. 2034 వరకు తెలంగాణ ప్రజల కోసం పనిచేస్తానని, 10% జీడీపీ దేశానికి ఇచ్చేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతానని అన్నా రు. ప్రస్తుతం ప్రజలు 'స్విగ్గీ పాలిటిక్స్' కోరుకుంటున్నారని, ఫలాలు తక్షణమే అందాలనే ఆలోచనతో జెన్‌జీ ఉందని, అందుకు అనుగుణంగా రాజకీయంగా ముందుకెళ్లాల్సి ఉంటుందని అన్నారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున రాహుల్ ప్రధాని అభ్యర్థిగా ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన వే2న్యూస్ కాంక్లేవ్2026లో ఆయన మాట్లాడారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. రాహుల్‌కు ప్రధాని కావాలనే లక్ష్యం లేదు.. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉంది. రాహుల్‌గాంధీ లక్ష్యం

మిగతా 2లో



# రక్షణ హబ్‌గా రాయలసీమ..

- పుట్టపర్తిలో స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టుకు భూమిపూజ...
- పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి పాల్గొన్న సీఎం చంద్రబాబు
- రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఐదో తరం యుద్ధ విమానాల తయారీ
- రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని సీఎం హామీ

మిగతా 2లో

ఆంధ్రప్రదేశ్‌ను రక్షణ, వైమానిక రంగంలో కీలక కేంద్రంగా మార్చే దిశగా శుక్రవారం భారీ ముందడుగు పడింది. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సుమారు రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం ద్వారా దేశీయంగా ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్‌ల అభివృద్ధి, తయారీకి మార్గం సుగమం కానుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, కేంద్ర

# జూన్ 21న నీట్ రీఎగ్జామ్

- వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష
- ఎలాంటి అవకతవకలు జరగకుండా సంస్కరణలు
- ఎవరైనా తప్పుడు పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- నీట్ రీఎగ్జామ్ వ్యవధి 15 నిమిషాలు పెంపు
- వచ్చే నెల 14 కల్లా అభ్యర్థులకు అడ్మిట్ కార్డులు జారీ
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటన




2లో



# పొరుగు రాష్ట్రం నేతతో నన్ను పోల్చవద్దు..

- అండగా ఉంటానన్న నేతలు ఆ రోజు పారిపోయారు: పవన్ కల్యాణ్
- మంగళగిరిలో జనసేన ఉద్యమి సమావేశం
- శస్త్రచికిత్స తర్వాత తొలిసారిగా సమావేశానికి విచ్చేసిన పవన్
- జనసేన క్యాడర్ కు దిశానిర్దేశం
- 2019లో తనను రెండు చోట్లా ఓడించారని వెల్లడి



# భారత్‌కు ఇంధన భద్రత

- భారత్, యూఏఈ మధ్య ఏడు కీలక ఒప్పందాలు
- పెట్రోలియం, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ నిల్వల పెంపునకు యూఏఈ సహకారం
- భారత్‌కు ఎల్పీజీ దీర్ఘకాలిక సరఫరాకు ముందుకొచ్చిన అరబ్ ఎమిరేట్స్
- యూఏఈ అధ్యక్షుడు అల్‌నహ్యాన్‌తో మోదీ భేటీ
- వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయం
- పశ్చిమాసియాలో శాంతి సాధనకు సహకరిస్తామన్న ప్రధానమంత్రి

అబూదాబీ: పశ్చిమాసియాలో శాంతి సాధనకు సహకరించడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆయన శుక్రవారం అబూదాబీలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్‌నహ్యాన్‌తో సమావేశమయ్యారు. భారత్‌యూఏఈ ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. భారత్‌కు ఇంధన భద్రత కల్పించడంతోపాటు రక్షణ, సాంకేతిక రంగాల్లో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా కీలక ఒప్పందాలపై ఇరుపక్షాలు సంతకాలు చేశాయి.

# నా పేరు వాడొద్దు... కోర్టును ఆశ్రయించిన బండి సంజయ్

- పోక్సో కేసులో తన పేరును ఉపయోగించకుండా చూడాలని పిటిషన్
- ఇప్పటి వరకు వాడిన వీడియోలు తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి
- తన కుమారుడి వివాదంలో తన పేరు ఉపయోగించకుండా ఉత్తర్వులివ్వాలన్న బండి సంజయ్



2లో

# వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు..

- వాళ్లది పవర్ ఫుల్ కాంబో : మంత్రి నారా లోకేష్
- పుట్టపర్తిలో ఏఎంసీఏ స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్‌కు భూమిపూజ
- మోదీ, రాజ్ నాథ్, చంద్రబాబు 75 ఏళ్ల కుర్రాళ్లు అంటూ లోకేష్ ప్రశంసలు
- వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ తట్టుకోలేమన్న లోకేష్
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఐరన్ మ్యాన్‌గా అభివర్ణన





# బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు

- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మహేష్ గౌడ్
- గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని ఆరోపణ
- బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని వ్యాఖ్య

2లో

# పెట్రో మంట

- పెట్రోల్, డీజిల్.. లీటరుపై రూ.3 వడ్డన.. సీఎన్‌జీపైనా కిలోకు రూ.2 భారం
- రెండేళ్ల తర్వాత మళ్లీ పెరిగిన ధరలు.. అంతర్జాతీయ మార్కెట్లో సెంచరీ కొట్టిన ముడిచమురు






## రక్షణ హబ్‌గా రాయలసీమ..

పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టుతో పాటు అనకాపల్లి జిల్లాలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) నావల్ సిస్టమ్స్ యూనిట్, కర్నూలులో ఏర్పాటు చేయనున్న 'డ్రోన్ సిటీ' సహా మొత్తం రూ.4,145 కోట్ల విలువైన మరో 12 రక్షణ ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. దేశానికి ఆంధ్రప్రదేశ్ రక్షణ కవచంగా నిలుస్తోందన్నారు. "ఒకప్పుడు రతనాల సీమగా ఉన్న రాయలసీమను మళ్లీ అదే స్థాయికి తీసుకెళ్లే బాధ్యత నాది. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి పూర్తి చేసి సీమకు కానుకగా ఇస్తాం," అని ఆయన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన రక్షణ ఉత్పత్తుల ప్రదర్శనను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి లోకేష్ తిలకించారు. ఇందులో అత్యాధునిక క్షిపణులు, తుపాకులు, హ్యాండ్ గ్రెనేడ్లు, యుద్ధ విమానం ప్రోటోటైప్‌లను పరిశీలించారు. ఈ ప్రాజెక్టులను డీఆర్‌డీవో ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) అభివృద్ధి చేస్తోంది.

## వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు...

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు.. వీరంతా 75 ఏళ్ల కుర్రాళ్లు అంటూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వారి వయసు 75 ఏళ్లయినా, వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ చూస్తుంటే తనకు ఆశ్చర్యం వేస్తుందని అన్నారు. ఈ ముగ్గురి వేగాన్ని తట్టుకోవడం ఎవరి వల్లా కాదని లోకేష్ వ్యాఖ్యానించారు. వీరిది పవర్ ఫుల్ కాంబినేషన్ అని కొనియాడారు.దపుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కలిసి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్ర మారబోతోందని లోకేష్ అన్నారు. రక్షణ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు రానున్నాయని, యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, పాకిస్థాన్‌కు గట్టి జవాబిచ్చిన 'ఆపరేషన్ సిందూర్'ను గుర్తుచేస్తూ, దాని వెనుక ఉన్న అసలైన శక్తి, ఐరన్ మ్యాన్ కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ అని లోకేష్ ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా ఏపీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు

తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (రా×=)పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో దశ ఎస్ఐఆర్ నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో, శుక్రవారం కాంగ్రెస్ ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (జజూ) సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని, బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి 'దొంగ ఓట్ల' సహాయంతోనే గెలిచారని ఘాటుగా ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలు లేనందున, ఈ సవరణ ప్రక్రియను తొందరపాటుతో కాకుండా ఏడాది పొడవునా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## పెట్రో మంట



న్యూఢిల్లీ: సామాన్యుడిపై మళ్లీ ధరల పిడుగు పడింది. చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచాయి. లీటరు పెట్రోల్, డీజిల్‌పై ఏకంగా రూ.3 చొప్పున పెంచుతూ నిర్ణ యం తీసుకున్నాయి. ఈ పెరిగిన ధరలు శుక్ర వా రం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఏప్రిల్ 2022 తర్వాత ఇంధన ధరల్లో ఈ స్థాయిలో పెంపు జరగడం ఇదే తొలిసారి. మార్చి 2024లో ఎన్నికల ముందు లీటరుకు రూ.2 మేర రేట్లను తగ్గించిన కేంద్రం.. ఇప్పుడు ఒకేసారి రూ.3 వడ్డించడం గమనార్హం. పెట్రోల్, డీజిల్‌తోపాటు సీఎన్‌జీ ధరలు కూడా పెరిగాయి. కిలో సీఎన్‌జీపై రూ.2 వడ్డిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఢిల్లీలో కిలో సీఎన్‌జీ ధర రూ.79.09కి చేరింది. ఈ పెంపు ఆటో, ట్యాక్సీ డ్రైవర్లతో పాటు సొంత వాహనదారులకు భారంగా పరిణమించింది. ధరలు ఎందుకు పెరిగాయి?: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులే ఈ పెంపునకు ప్రధాన కారణం. ఇరాన్‌అమెరికా ఉద్రిక్తతల నేపథ్యంలో బ్యారెల్ క్రూడాయిల్ ధర 70 డాలర్ల నుంచి ఏకంగా 100 డాలర్లకు పైగా చేరింది. దీంతో చమురు సంస్థలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఈ సంస్థలు నెలకు రూ.30,000 కోట్ల నష్టాన్ని మూటగట్టుకుంటున్నాయని పెట్రోలియం మంత్రిత్వ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. నష్టాలను పూడ్చుకునేందుకే ఈ పెంపు నిర్ణయం తీసుకున్నాయి. వాస్తవానికి పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్ వంటి పొరుగు దేశాల్లో ఎప్పుడో ఇంధన ధరలు 15 శాతం నుంచి 20 శాతం మేర పెరిగినా.. భారత్‌లో మాత్రం ఆ భారాన్ని ఇప్పటివరకు వినియోగదారులపై మోపలేదు.

# భారత్‌కు ఇంధన భద్రత

(మొదటి పేజీ తరువాయి)

భారత్‌లో 5 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టడానికి యూఏఈ ముందుకొచ్చిందని మోదీ వెల్లడించారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి మొదట యూఏఈలో పర్యటించారు. దాదాపు రెండున్నర గంటలపాటు అబూదాబీలో ఉన్నారు. యూఏఈ అధ్యక్షుడితో జరిగిన భేటీలో మాట్లాడుతూ.. యూఏఈపై ఇరాన్ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అరబ్ ఎమిరేట్స్‌ను లక్ష్యంగా చేసుకోవడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టంచేశారు. ప్రస్తుత పరిస్థితిని యూఏఈ సంయమనంతో ఎదుర్కొన్న తీరు నిజంగా ప్రశంసనీయమని పేర్కొన్నారు.

**సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త ఊపు**

పశ్చిమాసియా సంక్షోభం వల్ల ప్రపంచ దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మోదీ గుర్తుచేశారు. సాధ్యమైనంత త్వరగా శాంతి నెలకొనాలని కోరుకుంటున్నామని, అందుకోసం తమ వంతు సహకారం కచ్చితంగా అందిస్తామని తేల్చిచెప్పారు. వివాదాలు, ఘర్షణలను చర్చలు, దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలన్నదే భారత్ విధానమని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఏడు రంగాల్లో వ్యూహాత్మక సహకార ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. యూఏఈ పర్యటనలో భాగంగా ఇంధనం, రక్షణ, మౌలిక సదుపాయాలు, షిప్పింగ్, అధునాతన సాంకేతికత వంటి రంగాల్లో ముఖ్యమైన ఒప్పందాలు కుదిరాయని మోదీ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ఇది భారత్‌యూఏఈ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త ఊపునిచ్చిందని తెలిపారు. భారత్‌లో భారీగా పెట్టుబడులకు యూఏఈ సిద్ధం కావడం రెండు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని వివరించారు. యూఏఈలో సంక్షిప్తమైన, అత్యంత ఫలవంతమైన పర్యటన జరిగిందన్నారు. భారత్‌యూఏఈ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై తన సోదరుడు అల్‌నహ్యాన్‌తో చర్చించానని పేర్కొన్నారు. ఈ పర్యటన ఫలితాలు ఇరుదేశాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసి, అభివృద్ధి శ్రేయస్సుకు దోహదపడతాయని విశ్వసిస్తున్నట్లు ఉద్ఘాటించారు. అంతకుముందు అబూదాబీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మోదీకి అల్‌నహ్యాన్ స్వయంగా స్వాగతం పలికారు. మోదీ పర్యటనకు యూఏఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు దీన్నిబట్టి స్పష్టమవుతోంది.

**ఓడల మరమ్మతుల్లో నైపుణ్యాభివృద్ధి**

భారతదేశ వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను పరిరక్షించే బాధ్యత కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర-వ్స్ లిమిటెడ్ వ్యూహాత్మక సహకారమే లక్ష్యంగా అబుదాబీ నేషనల్ ఆయిల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనివల్ల భారత్‌కు ఇంధన భద్రత చేకూరుతుంది. భారతదేశ పెట్రోలియం నిల్వలను పెంపొందించడంతోపాటు ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ నిల్వలను బలోపేతం చేయడానికి అబూదాబీ సంస్థ సహకరిస్తుంది. ఇండియాకు ఎల్పీజీ దీర్ఘకాలిక సరఫరా, ఆర్థిక స్థిరత్వం, ఇంధన భాగస్వామ్యం లక్ష్యంగా ఎల్పీజీ రంగంలో వ్యూహాత్మక సహకార ఒప్పందంపై సంతకాలు జరిగాయి. రక్షణ పారిశ్రామిక సహకారాన్ని బలోపేతం చేయడం, నూతనఆవిష్కరణలను ప్రోత్సహించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం, జాతీయ, ప్రాంతీయ భద్రతను పటిష్టం చేయడం లక్ష్యంగా వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పైనా సంతకాలు చేశారు.

## పొరుగు రాష్ట్రం నేతతో నన్ను పోల్చవద్దు..

(మొదటి పేజీ తరువాయి)



ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత కోలుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన 'జనసేన ఉద్యమి' సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, గడిచిన కొన్నేళ్లలో తాను ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తొలిసారిగా వెల్లడించారు. గత ఎన్నికల్లో విజయం తన ఒక్కడిది కాదని, క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేసిన ప్రతి జనసైనికుడు, వీరమహిళ, ఉద్యమిదేనని స్పష్టం చేశారు. పార్టీ భవిష్యత్ నిర్మాణం, భావజాల వ్యాప్తి, ప్రభుత్వంలో జనసేన పాత్ర వంటి కీలక అంశాలపై కార్యకర్తలకు సుదీర్ఘంగా వివరించారు. గత కొన్నేళ్లుగా తాను తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పోరాటం చేశానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. "ఎన్నికలకు ఏడాది ముందు నుంచి ప్రచారంలో తిరగడం, కరోనా సమయంలో లంగ్ ఇన్ఫెక్షన్ రావడంతో నా ఆరోగ్యం దెబ్బతింది. ఆ ఇన్ఫెక్షన్ ఇప్పటికీ పూర్తిగా తగ్గలేదు. దుమ్ము, ధూళిలో తిరగడం వల్ల సైనస్ ప్రాంతంలో దుమ్ము పేరుకుపోయి గట్టిపడిపోయింది. దీనివల్ల నా గొంతు కూడా చాలాకాలం ఇబ్బంది పెట్టింది. ఒక దశలో కంటి చూపులో కూడా తేడా వచ్చింది. భీమవరంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హైదరాబాద్ వెళ్లి చికిత్స తీసుకోవడానికి నెల రోజులు పట్టింది," అని వివరించారు. అభిమానుల ప్రేమ వల్లే తన భుజాలకు గాయాలయ్యాయని పవన్ భావోద్వేగంతో తెలిపారు. "నా రెండు భుజాల్లో కండరాలు తెగిపోయాయి (టేర్). ఎలా జరిగిందని వైద్యులు అడిగితే, మా వాళ్లు ప్రేమతో లాగేశారు అని చెప్పాను. షేక్ హ్యాండ్ ఇచ్చినప్పుడు అభిమానులు ప్రేమతో గట్టిగా లాగడంతో కండరాలు తెగిపోయాయి. మీ ప్రేమతో తెగిన కండరాలను మళ్లీ మీ ప్రేమే బాగుచేస్తుంది," అని అన్నారు. వెన్నెముకలో కూడా 10 నుంచి 11 చోట్ల కంప్రెషన్స్ ఉన్నాయని, క్రీడా నేపథ్యం ఉండటంతో ఆ నొప్పిని తట్టుకోగలుగుతున్నానని తెలిపారు. "లోపల ఎంత నొప్పి ఉందో నాకే తెలియదు. నా పెయిన్ టాలరెన్స్ చాలా ఎక్కువ. అయినా మీ అందరి ఆశీస్సులతో నేను బాగుంటాను" అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

**నన్ను ఇతరులతో పోల్చవద్దు**

తమిళనాడులో విజయ్ సాధించిన విజయంతో తనను పోల్చవద్దని పవన్ కల్యాణ్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. "పొరుగు రాష్ట్ర నేతలా మీరు కూడా చేసి ఉండాల్సింది అని చాలామంది సందేశాలు పంపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు వేరు. అదే పని 2019లో చేస్తే రెండుచోట్లా ఓడించారు కదా అండగా ఉంటానన్న నాయకులంతా ఆ రోజు పారిపోయారు. నాకు పదవి ముఖ్యం అనుకుంటే 2008లోనే ఎంపీగా పోటీ చేసేవాడిని, 2014లోనూ అవకాశం వచ్చింది. కానీ నాకు పార్టీని నిర్మించడం ముఖ్యం" అని స్పష్టం చేశారు.

## నా పేరు వాడొద్దు... కోర్టును ఆశ్రయించిన బండి సంజయ్

కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. పోక్సో కేసులో భవిష్యత్తులో తన పేరును వాడకుండా చూడాలని పిటిషన్ వేశారు. అలాగే తన పేరుతో ఇప్పటి వరకు వాడిన వీడియోలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమారుడిపై నమోదైన కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కాబట్టి ఈ వివాదంలో తన పేరును ఎక్కడా ఉపయోగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

ఇదిలా ఉండగా, బండి భగీరథ్ కేసులో బాలిక వివరాలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంపై కేసు నమోదైంది. బాలిక ఫొటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాల ప్రసారంపై కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు సోషల్ మీడియా ఖాతాల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపారు.

## జూన్ 21న నీట్ రీఎగ్జామ్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్య విద్యా సంస్థల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి వీలు కల్పించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)యూజీ రీఎగ్జామ్ జూన్ 21న నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. ఈ నెల 3న నిర్వహించిన నీట్(యూజీ)2026 పరీక్షను పేపర్ లీక్ కారణంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నీట్ పరీక్షలో ఇకపై ఎలాంటి అవకతవకలు జరగకుండా సంస్కరణలు ప్రారంభిస్తున్నామని, ఇందులో భాగంగా వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించబోతున్నట్లు ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. నీట్(యూజీ) పరీక్షలో అక్రమాలను సహించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. ఎవరైనా తప్పుడు పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రద్దయిన నీట్‌ను జూన్ 21న మళ్లీ నిర్వహించబోతున్నామని, ఈసారి పరీక్ష వ్యవధిని మరో 15 నిమిషాలు పెంచినట్లు తెలిపారు. ఎక్కడ పరీక్ష రాయాలన్నది అభ్యర్థులు నిర్ణయించుకోవచ్చని, జూన్ 14 కల్లా అడ్మిట్ కార్డులు అందజేస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి నీట్ అభ్యర్థులకు రవాణా ఏర్పాట్లను కేంద్రం సమన్వయం చేస్తుందన్నారు. ఎలాంటి సందేహాలు, భయాందోళనలు లేకుండా పరీక్షకు హాజరు కావాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అభ్యర్థులకు ధర్మేంద్ర ప్రధాన్ భరోసా ఇచ్చారు. పొరపాట్లకు తావులేకుండా అత్యంత పకడ్బందీగా పరీక్ష నిర్వహిస్తామన్నారు. మాఫియా కుట్రలు, ధన బలం వంటివి విద్యార్థుల మెడికల్ సీటును లాక్కోవాలని తాము కోరుకోవడం లేదని ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు.

# 2034 వరకు నేనే సీఎం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే. ప్రధాని కావాలన్న లక్ష్యం ఆయనకు లేదు. కానీ ప్రధాని పదవి తీసుకోవాలని వికారాబాద్ మీటింగ్‌లో రాహుల్‌ను నేను ఒప్పించా. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్‌గాంధీయే. ఈ మేరకు ఇండియా కూటమిని ఒప్పిస్తాం. ప్ర్రధానిగా మోదీ, సీఎంగా నేను ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నాం. మేం మైక్‌ల ముందే మాట్లాడుకున్నాం. ఇందులో రహస్యం లేదు. నిధుల కోసం తమతో కలసిరావాలని మోదీ నన్ను అడిగారు. మేం మాట్లాడుకుంది ప్రభుత్వాల సహకారం గురించి మాత్రమే.

**చొరవ ఉంది కానీ గీత దాటను..**

నేను రాహుల్‌గాంధీ నాయకత్వంలో పనిచేస్తా. నేను నా మనసుకు నచ్చినట్టు చేస్తా. అవకాశాల కోసం అవకాశవాదిగా మారను. కొంతమంది ఓటమికి కుంగిపోతారు. గెలుపునకు పొంగిపోతారు. కానీ ప్రజాప్రతినిధిగా నా ఆలోచనలో నాకు స్పష్టత ఉంది. నిబద్ధతతో పార్టీలో చేరాననే గాంధీ కుటుంబం నాకు అవకాశమిచ్చింది. సోనియా, రాహుల్, ప్రియాంకల వద్ద నాకు చొరవ ఉంది. కానీ నా గీత నేను దాటను.

**అప్పుడూ ఇప్పుడూ ఒకే ఇంట్లో..**

జెడ్పీటీసీగా ఉన్నప్పుడు ఏ ఇంట్లో ఉన్నానో సీఎం అయ్యాక కూడా అదే ఇంట్లో ఉన్నా. ఇందిరమ్మ ఇంట్లో ఉన్న వెద్మ బొజ్జు, రూపాయి చేతిలో లేని మందుల సామేల్‌ను ఎమ్మెల్యేలను చేశాం. కష్టపడ్డ నేతలకు నామినేటెడ్ పోస్టులిస్తున్నాం. చాకలి ఐలమ్మ కుటుంబం, శ్రీకాంతాచారి కుటుంబం, కోదండరాం, ఆకనూరి మురళి ఇలా అందరిని గుర్తు పెట్టుకుని పదవులు ఇచ్చాం.

**ప్రజల సమస్యలపై అవగాహన ఉంది..**

జీవితంలో నేను చాలా సౌకర్యంగా ఉన్నా.. 100 శాతం సంతృప్తితో ఉన్నా. భవిష్యత్తు తరాల కోసం ఏదైనా చేయాలన్నదే నా ఆలోచన. ముఖ్యమంత్రి అయ్యేంత వరకు 17 ఏళ్ల పాటు ప్రతిపక్షంలోనే ఉన్నా. ప్రజా సమస్యలపై అవగహన ఉంది. సీఎంగా వ్యవస్థలను పట్టాలెక్కించాల్సిన బాధ్యత నాపై ఉంది. గతంలో కులాలు, మతాల వారీగా పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఇది కుల వ్యవస్థను ప్రోత్సహించినట్లే కదా? నేను సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాను. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌లో అన్ని కులాలు, మతాల విద్యార్థులుంటారు. రాష్ట్రంలో గంజాయి నిర్మూలించాలనుకుంటున్న నన్ను విలన్‌లా చూస్తున్నారు. డ్రగ్స్ తీసుకుంటే ఏ కీలుకు ఆ కీలు తీస్తా. ఎవరు అడ్డువచ్చినా మూసీని ప్రక్షాళన చేస్తాం. నగరాలను కలుషితం చేస్తే మరిచిపోతారు కాని నీటి వనరులను కలుషితం చేస్తే ఎప్పటికీ మరిచిపోరని జపాన్‌లో ఒక సామెత ఉంది. యుద్ధం జరిగినప్పుడు కొందరు అమాయకులు కూడా చనిపోతారు. యుద్ధ నీతే అది. ఆక్రమణలదారులకు ముందే నోటీసులు ఇస్తున్నాం. ఎవరూ మూసీ మురికిలో ఉండాలని కోరుకోరు. బుర్రలేని లేని వాళ్లు టెండర్లు, కాంట్రాక్టులు మాత్రమే చూస్తారు.. టెండర్లు ఇచ్చి కమీషన్లు తీసుకునే వారి ఆలోచన వేరే ఉంటుంది.



# పాముకుంటలో ముదిరాజ్ భవన కల సాకారం..!

- నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సర్పంచుల ఫోరం అధ్యక్షులు నరేష్ గౌడ్

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని పాముకుంట గ్రామంలో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజాపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రంగ నరేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల సంఘాల బలోపేతానికి, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు భవన నిర్మాణాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం అవసరమని, గ్రామస్తుల మధ్య ఐక్యతను చాటడంలో ఇలాంటి కమ్యూనిటీ భవనాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ముదిరాజ్ కులస్తుల ఆత్మీయ సమ్మేళనాలకు, పేద కుటుంబాల శుభకార్యాలకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఆకాంక్షించారు. సకల వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, భవన నిర్మాణానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బండి భగీరథ్‌ను తక్షణం అరెస్టు చేయాలి

- బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని సీపీఐ డిమాండ్



**తొలివెలుగు, రాజాపేట:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాట్లాడిన సీపీఐ మండల కమిటీ నాయకులు, "చట్టం ముందు అందరూ సమానులే. సామాన్యుడైనా, అధికారంలో ఉన్న వారి కుటుంబ సభ్యుడైనా తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు" అని పేర్కొన్నారు. అధికార హోదాను అడ్డుపెట్టుకుని కేసులను ప్రభావితం చేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమని విమర్శించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ తన కుమారుడిని వెనకేసుకురావడం బాధ్యతారాహిత్య చర్య అని ఆరోపించిన వారు, నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కేంద్ర ప్రభుత్వం ఆయన్ను పదవి నుండి తొలగించాలని కోరారు. దేశంలో చట్టపరమైన వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం నిలవాలంటే అధికారంలో ఉన్న వారిపైనా సమానంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు అభిప్రాయపడ్డారు. న్యాయం అందరికీ ఒకేలా ఉండాలని, రాజకీయ ప్రభావాలతో కేసులను మళ్లించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యకర్తలు బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇందిరమ్మ నూతన ఇంటి గృహప్రవేశం


రాజాపేట: రాజాపేట మండల పరిధిలోని పాముకుంట గ్రామంలో బడే ఉపేంద్రమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలతో జరిగిన ఈ కార్యక్రమం గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపించింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తుల సమక్షంలో గృహప్రవేశ వేడుక కన్నులపండువగా సాగింది. ఈ శుభకార్యానికి రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రంగ నరేష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఉపేంద్రమ్మ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సాధారణ కుటుంబాలకు సొంతింటి కల నెరవేరడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పేదల గృహ నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, సర్పంచులు, మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## కోర్టు స్టే 'బేఖాతర్'...

# సాల్వో దందా జోరు!

- వివాదాస్పద భూమిలో ప్లాట్ల విక్రయాలు
- అధికారుల కళ్లుగప్పి 'చల్లూరు'లో క్రయవిక్రయాలు
- జిల్లా కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు




**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం చల్లూరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 322/4లో ఉన్న భూమికి సంబంధించిన వివాదం మరింత ముదురుతోంది. వివాదాస్పద భూమి, దారిపై కోర్టు కేసులు కొనసాగుతుండగానే సాల్వో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అక్రమంగా ప్లాట్ల విక్రయాలు నిర్వహిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తోందంటూ పలువురు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఫిర్యాదుదారుల వివరాల ప్రకారం, సాల్వో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 2023 సంవత్సరంలో హైదరాబాద్ డిటిసిపి అధికారుల నుండి టి.ఎల్.పి నంబర్ 161/2023/హెచ్ కింద సుమారు 70.59 సెంట్ల భూమికి లేఅవుట్ అనుమతులు పొందింది. అయితే ఈ లేఅవుట్‌కు సంబంధించిన దారి విస్తీర్ణం 0.24 గుంటల విషయంలో 2020 నుంచే భాగస్వాముల మధ్య వివాదం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ భూమి, దారికి సంబంధించిన వివాదం ఆలేరు కోర్టులో ఓఎస్ నంబర్ 5/2020 కింద సివిల్ కేసుగా పెండింగ్‌లో ఉందని ఫిర్యాదుదారులు తెలిపారు. అంతేకాకుండా, ఈ లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న భూముల యజమానులైన శ్రీనాథ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, సర్వే డిమార్కేషన్ సర్టిఫికెట్ చెల్లదని ఆరోపిస్తూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించారు. డబ్ల్యూ.పి నంబర్ 9691/2024 ద్వారా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, సంబంధిత అంశంపై తెలంగాణ హైకోర్టు స్టే మంజూరు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కోర్టు స్టే అమల్లో ఉండగానే సాల్వో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ లేఅవుట్‌లో ప్లాట్లను విక్రయించడం చట్ట విరుద్ధమని ఆరోపించారు. ప్రస్తుతం భారీ ప్రచారాలతో ప్లాట్ల అమ్మకాలు కొనసాగుతున్నాయని, అసలు భూమిపై న్యాయపరమైన వివాదాలు ఉన్న విషయం తెలియక అమాయక ప్రజలు పెట్టుబడులు పెట్టి మోసపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసే ముందు ప్రజలు భూమికి సంబంధించిన కోర్టు కేసులు, అనుమతులు, రికార్డులు పూర్తిగా పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, కోర్టు వివాదంలో ఉన్న భూముల విక్రయాలను నిలిపివేయాలని ఫిర్యాదుదారులు కోరారు. అలాగే ప్రజలను మోసం చేసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చల్లూరు గ్రామంలో ఈ వ్యవహారం ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీస్తుండగా, అధికారుల స్పందన ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.




# ఉపాధి చట్టానికి తూట్లు.. కూలీల పాట్లు!

- బీ.వీ. రాంజీ' పేరిట పాత చట్టానికి మంగళం
- సౌకర్యాలు శూన్యం.. వేతనాల్లో కోత
- బొందుగులలో సమ్మె సైరన్ మోగించిన కార్మికులు
- పట్టణ పేదలకూ పని కల్పించాలని జూకంటి పౌలు డిమాండ్



**తొలివెలుగు, రాజాపేట:** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేయడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూకంటి పౌలు అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం రాజాపేట మండలంలోని బొందుగుల గ్రామంలో ఉపాధి హామీ కార్మికులు పనుల వద్దే సమ్మె చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పౌలు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సంపద సృష్టిలో ఉపాధి కూలీల పాత్ర కీలకమన్నారు. చెరువుల్లో పూడికతీత, గట్ల నిర్మాణాలు, మట్టి పనులు, రహదారులు, కాలువల నిర్మాణం వంటి అభివృద్ధి పనుల ద్వారా పల్లెల రూపురేఖలు మారుతున్నాయని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో లక్షలాది కుటుంబాలకు జీవనాధారమైన ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసి, దానికి బదులుగా బి.వి. రాంజీ పథకాన్ని తీసుకురావడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. కొత్తగా తీసుకొస్తున్న జీవోల వల్ల కార్మికులు పనులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. చేసిన పనికి పూర్తి స్థాయిలో కూలి వస్తుందో లేదో తెలియని అయోమయ స్థితి నెలకొందని, వారానికోసారి చెల్లించాల్సిన వేతనాలను సకాలంలో ఇవ్వకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పాత చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని, పథకానికి కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు కేటాయించాలని, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు కూడా ఉపాధి పనులను విస్తరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కట్ట రవికుమార్, మండల గౌరవాధ్యక్షుడు గొల్లూరి ప్రభాకర్, నాయకులు కట్ట శ్రీకాంత్, ముక్కా పూసయ్య, కొమ్ము ఎల్లమ్మ, కొల్లూరు పుష్ప, ముక్క సోమరాజవ్వ, గురిజాకుంట ప్రమీల, బోయిని అరుణ, బల్లి సుగుణ, రేణుక, ముక్క ఉమా, ఉప్పరివాని యేసయ్య తదితర కార్మికులు విశేషంగా పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే 'మదర్ డెయిరీ' ధ్యేయం

- మదర్ డెయిరీకి పూర్వవైభవం తెస్తాం
- పాడి రైతులకు ఆరు బిల్లుల చెల్లింపు
- డైరెక్టర్లు గొల్లపల్లి రాంరెడ్డి, సందిల భాస్కర్ గౌడ్




**తొలివెలుగు, రాజాపేట:** డెయిరీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం ద్వారా మదర్ డెయిరీకి పూర్వవైభవం తీసుకువస్తామని ఆ సంస్థ డైరెక్టర్లు సందిల భాస్కర్ గౌడ్, గొల్లపల్లి రాంరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం రాజాపేటలోని పాల శీతలీకరణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా మదర్ డెయిరీ పనిచేస్తోందని, అందులో భాగంగానే మూడు నెలలకు సంబంధించిన ఆరు బిల్లులను రైతులకు అందజేసినట్లు వెల్లడించారు. మిగిలిన బకాయిలను కూడా త్వరలోనే చెల్లిస్తామని ఈ సందర్భంగా రైతులకు హామీ ఇచ్చారు. ప్రైవేటు డెయిరీలను నమ్మి రైతులు మోసపోవద్దని, నాణ్యమైన పాలను సరఫరా చేసి మదర్ డెయిరీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు కోరారు. సరైన పోషణతో అధిక దిగుబడి సాధించి లాభాలు పొందాలని సూచించారు. ఎన్‌డీడీబీ సహకారంతో డెయిరీని ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని డెయిరీ పునరుద్ధరణకు సహకరించాలని సొసైటీ అధ్యక్షులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్లు ఆర్కాల గాల్ రెడ్డి, చింతలపూరి వెంకట్రాంరెడ్డి, మేనేజర్ శేఖర్, సూపర్‌వైజర్ రాములు, వివిధ గ్రామాల సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

# బేగంపేటలో జింక అనుమానాస్పద మృతి

- ఫెన్సింగ్‌ను ఢీకొట్టడం వల్లేనా?
- అనుమానాలు వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బేగంపేట గ్రామ సమీపంలో ఒక జింక అనుమానస్పదంగా మృతి చెంది ఉండడం కలకలం రేపింది. స్థానిక రైతు జిట్ట శ్రీనివాస్ రెడ్డికి చెందిన వ్యవసాయ బావి వద్ద శుక్రవారం ఈ జింక మృతదేహం గ్రామస్తులు, రైతులకు కనిపించింది. జింక తలకు తీవ్ర గాయమై ఉండడంతో మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చల్లూరు నుంచి బేగంపేట వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఈ వ్యవసాయ భూమి ఉండడం గమనార్హం. అడవి నుంచి వచ్చిన రెండు జింకలు వేగంగా పరిగెడుతుండడాన్ని అంతకుముందు కొందరు రైతులు గమనించారు. ఈ క్రమంలోనే ఒక జింక పొలానికి ఉన్న ఫెన్సింగ్ తీగను బలంగా ఢీకొట్టడం వల్ల తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. అయితే, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా జింకను వేటాడి చంపారా అనే కోణంలోనూ గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వన్యప్రాణుల రక్షణకు అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





## బాధిత కుటుంబానికి అండగా 'బీర్ల ఫౌండేషన్'

- చల్లూరులో రాజయ్య కుటుంబానికి బియ్యం అందజేత

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం చల్లూరు గ్రామంలో ఇటీవల మరణించిన బైకని రాజయ్య కుటుంబాన్ని శుక్రవారం గ్రామ శాఖ అధ్యక్షుడు శాగ నవీన్ ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ విధమైన సహాయం ఎంతో ఊరటనిస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం బీర్ల ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో నిరుపేద కుటుంబాలకు అవసరమైన సమయంలో సహాయం అందించేందుకు ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చల్లూరు గ్రామ ఉప సర్పంచ్ బొంత సుధాకర్, బైకని కనకయ్య, సొల్లేటి స్వామి, మీసా బాల మల్లయ్య, చేట్కూరి గౌరయ్య, మునిగడప కనకయ్య, పెంట శ్రీహరి, మంతపురి పరశురాములు, బొంత రాజు, బైకని మల్లయ్య, బైకని శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## ఘనంగా మాస శివరాత్రి పూజలు




- మంత్రోచ్ఛారణల మధ్య శివయ్యకు అభిషేకాలు

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య శివలింగానికి పంచామృతాలు, వివిధ రకాల ఫలరసాలతో శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, మహామంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు భక్తులకు మాస శివరాత్రి విశిష్టతను వివరించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

## తేమ, తాలు పేరిట రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- కొనుగోలు కేంద్రాల్లో సీఐ, ఎస్ఐల ఆకస్మిక తనిఖీ
- సమస్యలు అడిగి తెలుసుకున్న అధికారులు

**తొలివెలుగు, రామన్నపేట:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాలు, తేమ పేరిట రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నాగరాజు హెచ్చరించారు. మండలంలోని తుమ్మలగూడెం గ్రామంలో ఉన్న విద్యా రైస్ మిల్లు (ధాన్యం కొనుగోలు కేంద్రం)ను శుక్రవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను, కాంటాల వద్ద ధాన్యం తూకాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడికి ధాన్యం తీసుకువచ్చిన రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తూకాల్లో ఏమైనా మోసాలు జరుగుతున్నాయా, సకాలంలో లారీలు వస్తున్నాయా అని ఆరా తీశారు. అనంతరం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, అధికారులతో సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ.. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు కచ్చితంగా గిట్టుబాటు ధర దక్కాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎవరైనా దళారులు రైతులను మోసం చేయాలని చూస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు

- వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల కరపత్రాల ఆవిష్కరణ
- 18న రామన్నపేటలో జిల్లా బహిరంగ సభ

**తొలివెలుగు, రామన్నపేట:** సుదీర్ఘ పోరాటాల ఫలితంగా, వామపక్షాల మద్దతుతో ఏర్పడిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించడం తగదని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కందుల హనుమంతు, కార్యదర్శి మేడి ముకుంద అన్నారు. మండల పరిధిలోని కక్కిరేణి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి శుక్రవారం వారు వెళ్లారు. అక్కడ సంఘం జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు, కుటుంబ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ చట్టం ఎంతో భరోసా కల్పించిందని గుర్తుచేశారు. అయితే, ప్రస్తుత పాలకులు నిధులను పక్కదారి పట్టిస్తూ, అనేక కొర్రీలతో చట్టాన్ని ఉనికి లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధి పనుల్లో ప్రవేశపెట్టిన ఫేషియల్ అటెండెన్స్ (ఫోటో క్యాప్షన్) విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మూడు, నాలుగు కిలోమీటర్లు నడిచి వస్తున్న కూలీలకు సాంకేతిక లోపాల వల్ల ఫోటోలు నమోదు



కాకపోవడంతో వెనుతిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బయోమెట్రిక్ లేదా కంటి గుర్తింపుతో లింకు పెట్టకుండా పనిచేసే ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 18న రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభల బహిరంగ సభకు అఖిల భారత కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్, రాములు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సభను వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కక్కిరేణి వ్యవసాయ కార్మిక సంఘం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు వేముల సైదులు, కన్నెబోయిన యాదయ్య, నీల సంతోష, మమత, నాగమణి, పార్వతమ్మ, అండాలు, రాధా, కల్పన, లక్ష్మి, కవిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.



# మద్దతు ధరల పెంపు నామమాత్రమే

- వరి క్వింటాకు రూ. 3,250 ఇవ్వాలి
- స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి




**తొలివెలుగు, రాజాపేట:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించిన ఖరీఫ్ కనీస మద్దతు ధరలు (ఎంఎస్పీ) నామమాత్రంగా ఉన్నాయని, ఇది దేశ రైతాంగాన్ని మరోసారి మోసం చేయడమేనని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో పాటు డీజిల్, పెట్రోల్, విద్యుత్, లేబర్, ఆధునిక యంత్రాల తాలూకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయన్నారు. ముఖ్యంగా పశ్చిమాసియా యుద్ధ సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ధరలు పెరిగిన నేపథ్యంలో, కేంద్రం ప్రకటించిన ఈ పెంపు ఏమాత్రం సమంజసం కాదన్నారు. సమగ్ర సాగు వ్యయం (సీ2)పై అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర ఇస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని గతంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కు గానూ వరి ఏ-గ్రేడ్ కు రూ. 2,461, బి-గ్రేడ్ కు రూ. 2,441 మాత్రమే ప్రకటించారని, అయితే ప్రస్తుత పెట్టుబడుల ప్రకారం వరికి కనీసం రూ. 3,250 మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంటే ఇప్పుడు ప్రకటించిన ధర కంటే అదనంగా రూ. 800 పెంచి ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్పొరేట్ వ్యవసాయ వ్యాపార సంస్థలకు లబ్ధి చేకూర్చే రైతు వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా మరో మహా రైతు పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి గన్నెబోయిన విజయభాస్కర్, నాయకులు కందుల హనుమంతు, గాదె నరేందర్, వేముల సైదులు, మేడి ముకుంద తదితరులు పాల్గొన్నారు.

## భానుడి భగభగల్లోనూ ఆగని 'సెన్సస్' వేట!

- ఇంటింటికీ తిరిగి వివరాల సేకరణ
- ఆరెగూడెంలో ఎన్యూమరేటర్ హరికిషన్ నిరంతరాయ విధులు
- గణన సిబ్బందికి ప్రజల అండ



**తొలివెలుగు, రామన్నపేట:** జాతీయ జనాభా గణన (సెన్సస్)లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ మండలంలో ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు అత్యంత నిబద్ధతతో తమకు అప్పగించిన ఇండ్ల గణన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మండలంలోని అన్ని బ్లాకుల్లోనూ ప్రక్రియ వేగవంతంగా కదులుతోంది. తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా ఎన్యూమరేటర్లుగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరిస్తున్నారు. మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో ఎన్యూమరేటర్ గా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు పాల్వంచ హరికిషన్ శుక్రవారం ఇండ్ల గణన ప్రక్రియలో పాల్గొని, గడువులోగా పూర్తి చేసేందుకు నిరంతరాయంగా వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నివాస గృహాల హౌస్ లిస్టింగ్ ప్రక్రియను తప్పులు లేకుండా పూర్తి చేయడానికి ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారని తెలిపారు. ఇండ్ల గణన కోసం వస్తున్న సిబ్బందికి స్థానిక ప్రజల నుండి కూడా పూర్తి స్థాయిలో సహకారం లభిస్తోందని, నివాసితులు అడిగిన వివరాలను స్పష్టంగా అందిస్తూ ఎన్యూమరేటర్లకు తోడ్పాటునందిస్తున్నారని వివరించారు.



## ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

- ఇంద్రపాలనగరం జెడ్పీహెచ్ఎస్‌లో ఉచిత సమ్మర్ క్యాంప్ ప్రారంభం
- సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ పిలుపు

**తొలివెలుగు, రామన్నపేట:** వేసవి సెలవులను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకునేలా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత కరాటే శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ వేసవి శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఆత్మరక్షణ విద్యల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా బాలబాలికలు, యువతులు కరాటే నేర్చుకోవడం ద్వారా శారీరక, మానసిక ధృడత్వాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. గ్రామంలోని యువతీయువకులు, విద్యార్థులు ఈ ఉచిత కరాటే శిక్షణా సదుపాయాన్ని వినియోగించుకుని నైపుణ్యాలు పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామి, కరాటే మాస్టర్లు అప్పం చెన్నకేశ్వర్, తెల్లం ప్రసాద్, గ్రామ ప్రముఖులు ఈర్లపల్లి మల్లయ్య, మర్రి మహేష్, గర్ధాస్ శ్రీకాంత్, గర్ధాస్ సాయి, ఈర్లపల్లి కృష్ణ, ఈర్లపల్లి రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన






- ఘనంగా విద్యా వారోత్సవాలు - హాజరైన ఎంఈఓ గవ్వ జ్యోతి

**తొలివెలుగు, రామన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయ ఆవరణలో శుక్రవారం విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పుస్తక ప్రదర్శనను పాఠకులు, విద్యా ప్రేమికులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి (ఎంఈఓ) గవ్వ జ్యోతి మాట్లాడుతూ.. సమాజ వికాసానికి, విద్యార్థుల నాలెడ్జ్ పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ పుస్తక ప్రదర్శనను నిరుద్యోగులు, విద్యార్థులు, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరంతరం పుస్తక పఠనం ద్వారా ఉన్నత లక్ష్యాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జ్ కట్కూరి నరసింహ, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, గ్రంథాలయ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# ఆలయ నిర్మాణానికి రూ. 1.16 లక్షల విరాళం

- పులిగిల్లలో సీతారామచంద్రస్వామి ఉప ఆలయానికి సాయం
- భక్తులు భాగస్వాములు కావాలని కమిటీ పిలుపు










**తొలివెలుగు, వలిగొండ:** మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న గణపతి ఉప ఆలయ నిర్మాణం కొరకు గ్రామానికి చెందిన తపాలా శాఖ ఉద్యోగి ఎడ్ల మల్లారెడ్డి, పుష్పలత దంపతుల కుమారులు ఎడ్ల సంపత్‌రెడ్డి- భవాని, ఎడ్ల సందీప్‌రెడ్డి- ప్రియ దంపతులు రూ. 1,16,000ల ఆర్థిక సహాయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. విరాళం అందజేసిన దాతల కుటుంబానికి ఆ శ్రీ సీతారామచంద్ర స్వామి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని భగవంతుడిని ప్రార్థించారు. గ్రామంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ నూతన ఆలయ నిర్మాణ పనుల్లో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆలయ పునర్నిర్మాణాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# స్మార్ట్‌ఫోన్లు వద్దు.. పుస్తకాలే ముద్దు!

- పుస్తక పఠనంతోనే జ్ఞాన వికాసం
- స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండాలి
- పోచంపల్లిలో గ్రంథాలయ దినోత్సవం, పుస్తక ప్రదర్శన
- మండల విద్యాధికారి ప్రభాకర్



**తొలివెలుగు, చౌటుప్పల్/భూదాన్ పోచంపల్లి:** విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా అద్భుతమైన జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని మండల విద్యాధికారి (ఎంఈఓ) ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం పురపాలక కేంద్రంలోని శాఖా గ్రంథాలయ ఆధ్వర్యంలో గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్టాళ్లను సందర్శించి వివిధ రకాల పుస్తకాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. నేటి యువత, విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లకు అమితంగా అలవాటుపడి, ఎంతో విజ్ఞానాన్ని అందించే పుస్తకాల పఠనాన్ని మర్చిపోతుండటం విచారకరమన్నారు. పెరుగుతున్న ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం తరగతి గది చదువులకే పరిమితం కాకుండా, బాహ్య విజ్ఞానానికి సంబంధించిన అన్ని రకాల పుస్తకాలను చదవడం ద్వారా ఎన్నో నూతన విషయాలను గ్రహించవచ్చని సూచించారు. శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగుల కోసం అన్ని రకాల స్టడీ మెటీరియల్స్, దినపత్రికలు, డిజిటల్ వనరులను అందుబాటులో ఉంచామని వివరించారు. విద్యార్థులు, యువత వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, స్కూల్ అసిస్టెంట్ బ్రహ్మచారి, ఉపాధ్యాయులు సోమిరెడ్డి, మురహరి, కుమార్, గ్రంథాలయ సిబ్బంది కావ్య, శోభ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతోనే విజ్ఞాన సముపార్జన

- చౌటుప్పల్‌లో ఘనంగా పుస్తక ప్రదర్శన
- విజేతలను సన్మానించిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు చౌటుప్పల్‌లో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం చౌటుప్పల్ శాఖా గ్రంథాలయంలో 'గ్రంథాలయ దినోత్సవం', ప్రత్యేక 'పుస్తక ప్రదర్శన'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక ఆర్డీవో వి. శేఖర్ రెడ్డితో కలిసి ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగ యువత గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను నిరంతరం చదువుకుంటూ తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ముఖ్యంగా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు లైబ్రరీలోని అమూల్యమైన వనరులను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. సుధీర్ మాట్లాడుతూ.. గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం



చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దిశానిర్దేశం చేశారు.

**ఉద్యోగ విజేతలకు సన్మానం:**


చౌటుప్పల్ గ్రంథాలయంలో చదువుకుని ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన బూత తరుణ్ కుమార్ (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్), కనక ఐశ్వర్య (స్కూల్ అసిస్టెంట్, గణితం), వై. సూర్య (కానిస్టేబుల్)లను అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో సన్మానించారు. వీరు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ నాయక్, వివిధ వార్డుల ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి కొరత రానివ్వొద్దు

- పైప్‌లైన్ మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలి
- అధికారుల సమీక్షలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశం

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సరఫరాను క్రమబద్ధీకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి సరఫరా వ్యవస్థపై ఆయన శుక్రవారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పట్టణంలో ఎక్కడా నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత నీటి నిల్వలు, పంపింగ్ వ్యవస్థ పనితీరు, పైప్‌లైన్ మరమ్మతుల స్థితిగతులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలోని ఏ వార్డులోనైనా తాగునీటి సమస్య తలెత్తితే అధికారులు వెంటనే స్పందించి, తక్షణ పరిష్కార మార్గాలు చూపాలని స్పష్టం చేశారు. పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని, నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న అవసరమైన ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా ముందస్తుగా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే తాగునీటి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ నేత, రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) వి. శేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, స్థానిక కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.







# కేన్స్ వేదికపై పోచంపల్లి 'ఇక్కత్' వైభవం

- రెడ్ కార్పెట్‌పై ఇక్కత్ వస్త్రాలతో రష్మిక ఠాగూర్
- చేనేత ఖ్యాతిని ప్రపంచానికి చాటుతా: అంతర్జాతీయ బ్రాండ్ అంబాసిడర్




**తొలివెలుగు, చౌటుప్పల్/భూదాన్ పోచంపల్లి:** తెలంగాణ సాంస్కృతిక వారసత్వ సంపద, చారిత్రాత్మక పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత చాటేందుకు తన వంతుగా పూర్తిస్థాయిలో కృషి చేస్తానని మిస్ ఏసియా, భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ ఇంటర్నేషనల్ ఇక్కత్ అంబాసిడర్ రష్మిక ఠాగూర్ అన్నారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్ లో ఈనెల 17 నుండి 24 వరకు జరగనున్న ప్రతిష్టాత్మక 79వ కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో భారతదేశం తరఫున చేనేత బ్రాండ్ అంబాసిడర్ గా రష్మిక ఠాగూర్ పాల్గొంటున్నారు. ఈ వేడుకల్లో ఆమె పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను ధరించి రెడ్ కార్పెట్ పై నడవనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ నేతన్నల అద్భుత సృష్టి అయిన ఇక్కత్ వస్త్రాల కళావైభవాన్ని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించే అవకాశం రావడం తనకెంతో గర్వకారణంగా ఉందని రష్మిక పేర్కొన్నారు. కేన్స్ ఫెస్టివల్ చరిత్రలో మొట్టమొదటిసారిగా పోచంపల్లి చేనేత వస్త్రాలు ప్రదర్శనకు రావడం గొప్ప విషయమన్నారు. ఎంతోమంది చేనేత కళాకారులు ఎంతో ఓర్పు, క్రమశిక్షణతో రూపొందించిన ఈ వస్త్రాలు గ్లోబల్ వేదికపై మరింత వన్నె తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మగ్గం నుండి అంతర్జాతీయ రెడ్ కార్పెట్ మెట్ల వరకు ఇక్కత్ వస్త్రాలు పయనిస్తున్నాయంటే అది కేవలం చేనేత కళాకారుల అసాధారణ నైపుణ్యానికి నిదర్శనమన్నారు. ఈ ప్రదర్శన ద్వారా ఇక్కడి చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ లో మరిన్ని వ్యాపార సౌకర్యాలు మెరుగవుతాయని ఆకాంక్షించారు. తనకు ఈ అరుదైన అవకాశం కల్పించిన కేంద్ర జౌళి శాఖ, వీవర్స్ సర్వీస్ సెంటర్ తో పాటు, ప్రత్యేక వస్త్రాలను అందించిన పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో తడక రమేష్ కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# జూన్ మొదటి వారంలోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావాలి

- వేగవంతానికి ఇంటర్మీడియట్ గోదాముల ఏర్పాటు
- జూలూరు కొనుగోలు కేంద్రం, ముక్తాపూర్ రైస్ మిల్లును పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి





**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/భూదాన్ పోచంపల్లి:** వర్షాలు ప్రారంభం కాకముందే, జూన్ మొదటి వారంలోగా జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోచంపల్లి మండల పరిధిలోని జూలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ముక్తాపూర్ లోని విజయదుర్గ రైస్ మిల్లును ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. రైస్ మిల్లులో ధాన్యం దిగుమతులు, వడ్ల నుంచి బియ్యం తయారు చేసే ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్.. లారీలు వచ్చిన వెంటనే అన్‌లోడ్ చేసుకునేలా మిల్లుల యాజమాన్యాలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం జూలూరు కేంద్రంలో రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోచంపల్లి మండలంలో ఇప్పటివరకు 14 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలోనే పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట మండలాలు అతిపెద్ద ధాన్యం కొనుగోలు ప్రాంతాలుగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం బీహార్ హమాలీల కొరత ఉన్నందున, ప్రత్యామ్నాయంగా రైస్ మిల్లుల్లోని హమాలీలను ఉపయోగించి కొనుగోలు వేగవంతం చేస్తామన్నారు. కేంద్రాల్లో కాంటాల (తూకం) సంఖ్యను పెంచుతున్నామని, కొన్న ధాన్యాన్ని వెంటనే నిల్వ చేయడానికి రాజాపేట, తుర్కపల్లి, రామన్నపేట, వలిగొండ, చౌటుప్పల్ లలో ఇంటర్మీడియట్ గోదాములను అద్దెకు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వీటి ద్వారా సుమారు 25 వేల టన్నుల ధాన్యం దిగుమతికి వీలవుతుందన్నారు. లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు పక్క జిల్లాల్లోని రైస్ మిల్లులను కూడా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మేనేజర్ హరికృష్ణ, నాయబ్ తహశీల్దార్ నాగేశ్వరరావు, సర్పంచ్ కాసుల అంజయ్య, వ్యవసాయ అధికారి శైలజ, ఎస్సై భాస్కర్ రెడ్డి, ఆర్ఐ వెంకటరెడ్డి, సీఈఓ రెబ్బాస నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## పోక్సో కేసులో కానిస్టేబుల్‌కు 30 ఏండ్ల జైలు

బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో కానిస్టేబుల్ వరదరాజ్ సుదేష్ అలియాస్ ఉమేష్ (39)కు కోర్టు 30 ఏండ్ల జైలుశిక్ష విధించింది. జైలుశిక్షతోపాటు 12వేల జరిమానా చెల్లించాలని నాంపల్లిలోని ప్రత్యేక పోక్సోకోర్టు జడ్జి ఉదయ్‌భాస్కర్‌రావు శుక్రవారం తీర్పు వెల్లడించారు. బాధిత బాలికకు రూ.లక్ష పరిహారం చెల్లించాలని హైదరాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మారెళ్ల రమాదేవి కథనం ప్రకారం.. 2020లో వరుసకు మామ అయిన కానిస్టేబుల్ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. టీ ఇవ్వమని అమ్మమ్మ బాధిత బాలికను కోరగా సదరు బాలిక మొదటి అంతస్తులో ఉన్న గదిలోకి వెళ్లడంతో తలుపులు మూసి బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఇతరులకు చెబితే బాధిత బాలిక సోదరుడిపై గంజాయి కేసు నమోదు చేయిస్తానని బెదిరించినట్టు తెలిపారు. ఈ ఘటన గురించి నిందితుడి భార్యకు వివరించగా ఆమె సైతం బాలికపై బెదిరింపులకు పాల్పడినట్టు వివరించారు. భయంతో బాలిక మౌనం పాటించడాన్ని ఆసరాగా తీసుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్టు తెలిపారు. దీంతో ధైర్యంగా బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్టు బాధిత బాలిక తల్లి తెలిపింది. 12ఏళ్ల మైనర్ బాలిక వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేసి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించారు. సుధీర్ఘ విచారణ చేపట్టిన కోర్టు నిందితుడు నేరం చేసినట్టు రుజువుకావడంతో శిక్ష ఖరారు చేశారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా జైలుశిక్షను అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో వెల్లడించారు.



## ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్‌లో సాంకేతిక లోపం: నిలిచిన 'భగీరథ' నీరు

- ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి
- అధికారుల అత్యవసర సమీక్షలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండల పరిధిలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఎస్.డబ్ల్యూ లింగోటం పరిధిలోని 70 ఎంఎల్ డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్‌లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున 5 గంటల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు శుక్రవారం సంబంధిత అధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. భగీరథ నీటి సరఫరా పునరుద్ధరణ జరిగే వరకు ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు తక్షణమే స్పందించి తమ పరిధిలోని స్థానిక బోర్‌వెల్స్‌ను అందుబాటులోకి తెచ్చి వాటి ద్వారా ప్రజలకు నీటిని అందించాలని ఆదేశించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. కాగా, సాంకేతిక సమస్యను త్వరితగతిన పరిష్కరించి, నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వి. శేఖర్ రెడ్డి, ఎంపీడీఓ సందీప్ కుమార్, డివిజనల్ ఇంజనీర్ దీన్ దయాల్ రావు, ఏఈఈ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీ పేలి ఇల్లంతా మంటలు

వెంగళరావునగర్, మే 15 :అందరూ గాఢ నిద్రలో ఉండగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇల్లంతా దట్టంగా పొగ అలుముకుంది. మెలకువ వచ్చి బాల్కని తలుపు తెరిచి చూస్తే.. ఏసీ కంప్రెషర్ నుంచి మంటలు వ్యాపించి ఉన్నాయి. కాసేపటికి కంప్రెషర్ పేలిపోయింది. కంగారుతో బెడ్రూమ్ డోర్ తెరిచిన వెంటనే దట్టంగా పొగ అలుముకుంది. ఏసీలోంచి నిప్పురవ్వలు వచ్చి మంటలు చెలరేగాయి. భయాందోళనకు గురైన కుటుంబీకులు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. కష్టపడి కూడబెట్టిన రూ.10.60 లక్షలు, అరకిలో బంగారు ఆభరణాలతో పాటు సర్వస్వం కాలి బూడిదయ్యాంటూ బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యూసుఫ్‌గూడలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. యసూఫ్‌గూడ బస్తీ విశ్వవిహార్ అపార్ట్‌మెంట్స్‌లోని 4వ అంతస్తులో ఉద్దగిరి త్రివేణి(59) అనే వైద్యురాలు తన తల్లిదండ్రులు వై.ప్రసాదరావు(91), వై.లక్ష్మీ(81)తో కలిసి నిద్రిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి దాటాక గదిలో పొగ నిండుకున్నట్లు వాసన రావడం తో త్రివేణికి మెలకువ వచ్చిం ది.రూమ్‌లోని ఏసీలోంచి నిప్పురవ్వలు ఎగిరిపడి మంటలు వచ్చా యి. దీంతో తల్లిదండ్రులను అప్రమత్తం చేసి సురక్షితంగా వారిని బయటకు తెచ్చింది. మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న ఫర్నీచర్, అల్మారాల్లో దాచుకున్న అరకిలో కు పైగా బంగారు ఆభరణాలు, 6 కిలోల వెండి సామాగ్రి, రూ.10.60 లక్షల కరెన్సీ నోట్ల కట్టలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఆస్తి పత్రాలు, గుర్తింపు పత్రాలు, ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న డబ్బులు కాలిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మూడు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ధాన్యం రవాణా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం

- రెండు రోజుల్లో లారీల కొరత తీరుతుంది: సివిల్ సప్లై మేనేజర్ హామీ
- లింగోటం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సింగిల్ విండో ఛైర్మన్ దామోదర్ రెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎస్. లింగోటం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో ఛైర్మన్ చింతల దామోదర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రం ఇన్‌చార్జ్‌తో మాట్లాడి ఇప్పటివరకు జరిగిన కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసినప్పటికీ, లారీల కొరత కారణంగా రవాణా సకాలంలో జరగడం లేదని, మిల్లులకు తరలించడానికి 5 నుంచి 6 రోజుల సమయం పడుతోందని నిర్వాహకులు ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. లారీలు రాకపోవడంతో తూకం వేసిన బస్తాలు ఎక్కడికక్కడే పేరుకుపోయి, కొత్తగా వచ్చే ధాన్యానికి కాంటాలు వేయడం కష్టతరంగా మారిందని వివరించారు. రైతుల ఇబ్బందులను గమనించిన ఛైర్మన్ దామోదర్ రెడ్డి తక్షణమే స్పందించి జిల్లా సివిల్ సప్లై మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సమస్య తీవ్రతను వివరించగా, రెండు రోజుల్లో రవాణా సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని మేనేజర్ హామీ ఇచ్చారు. అలాగే ఏఎంసీ చౌటుప్పల్ గిడ్డంగిలో హమాలీల సంఖ్యను పెంచుతున్నామని, దీనివల్ల తాళ్ళసింగారం, ఎస్. లింగోటం కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం దిగుమతులు మరింత వేగవంతం అవుతాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు ఢిల్లీ మాధవరెడ్డి, ఉప్పు కృష్ణ, చెన్నగోని వెంకటేశం, ఆకుల అశోక్, పల్లం రమేష్, బండారు లింగయ్య, ఉప్పల కృష్ణయ్య, పీఏసీఎస్ కార్యదర్శి వై. రమేష్, సిబ్బంది నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఇల్లూ పక్కాగా సర్వే చేయాలి

- శేరిపల్లిలో జనగణన ప్రక్రియను పరిశీలించిన డీపీఓ యాదయ్య
- యాప్ సర్వర్ ఇబ్బందులపై నివేదించాలని సూచన

**తొలివెలుగు, టేక్మాల్:** మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో కొనసాగుతున్న మొదటి విడత జనాభా లెక్కల (జనగణన) కార్యక్రమాన్ని మెదక్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) యాదయ్య శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న సర్వే తీరును పర్యవేక్షించిన ఆయన, స్వయంగా చాకలి చంద్రయ్య, లలిత ల కుటుంబాల సర్వే ప్రక్రియలో పాలుపంచుకున్నారు. సిబ్బంది నమోదు చేస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. జనగణన విధుల్లో ఉన్న సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, గ్రామంలోని ప్రతి ఒక్క ఇంటిని, ప్రతి కుటుంబాన్ని తప్పనిసరిగా సర్వే చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా వివరాలు నమోదు చేయాలన్నారు. సర్వే నిర్వహణలో ఎన్యూమరేటర్లకు ఏమైనా ఇబ్బందులు ఎదురైనా, లేదా డేటా నమోదు చేసే యాప్ సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్ శ్రీవిద్య, టేక్మాల్ ఇన్‌చార్జ్ ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ దేవప్రసాద్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహేష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ మంగలి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీసీవై పార్టీ కార్యాచరణ

- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం
- అధికారి ఆర్.వి. కర్ణన్‌తో పార్టీ నేతల భేటీ
- బహుజనుల సాధికారతకు కృషి: డా. చిలకల శ్రీనివాస్ యాదవ్

**తొలివెలుగు, చౌటుప్పల్/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో బహుజన వర్గాల రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమ లక్ష్యాలతో ముందుకు సాగుతున్న బీసీవై పార్టీ రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు హైదరాబాద్‌లో ప్రముఖ అధికారి ఆర్. వి. కర్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ కార్యాచరణ, నగరంలో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, మౌలిక వసతుల కల్పనపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జీహెచ్ఎంసీ కన్వీనర్ తేజో విజయకుమారి, పీఏసీ సభ్యులు డా. చిలకల శ్రీనివాస్ యాదవ్, మేకల కార్తీక్ యాదవ్, మేకల వివేక్ యాదవ్, తీగల అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ పీఏసీ సభ్యుడు, విద్యావేత్త డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. సామాన్య ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. రాజకీయాలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదు.. ప్రజా సేవ కోసమేనని స్పష్టం చేశారు. నగరంలో ప్రధాన సమస్యలైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, నిరుద్యోగం, పేదల గృహ సమస్యలపై పార్టీ ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తోందని వెల్లడించారు. అనంతరం పార్టీ నాయకులు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రమతి చంద్రకళను కలిసి పేద ప్రజల కాలనీల్లో మౌలిక వసతులు, వీధి దీపాలు, చెత్త సమస్యల పరిష్కారంపై వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ నాయకత్వంలో తెలంగాణలో బీసీవై పార్టీ బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని నేతలు పేర్కొన్నారు.

